# ఫోటో దెబ్బకు కూలి కేక.!

- పని చేసి హాజరు లేక కూలీల విలవిల
- ఫోటో లేకపోతే వేతనం నిలిచే దుస్థితి
- నెలలుగా పేరుకుపోతున్న బకాయిల భారము
- అధికారుల నిర్లక్ష్యంపై మండుతున్న గ్రామాలు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 7 రాజ ముద్ర న్యూస్:**



ఉపాధి హామీ పనుల్లో ఫోటోల వ్యవస్థ కూలీల జీవితాలపై భారంగా మారింది. పని చేయడానికి ఉదయం నుంచే తండాలు, గ్రామాల నుంచి బయలుదేరిన కూలీలు, పని ముగిసే వరకు శ్రమిస్తున్నా... చివరికి ఒక ఫోటో పడకపోతే హాజరు లేకుండా మిగిలిపోతున్నారు. దీనివల్ల చేసిన కష్టానికి కూలి రాక, రోజుల తరబడి ఆకలి కేకలు వినిపిస్తున్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా అశ్వారావుపేట మండలంలోని అనేక గ్రామపంచాయతీల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. తండాలు, గిరిజన గ్రామాల్లో పనిచేస్తున్న కూలీలు "ఫోటోల లొల్లి"తో విసిగిపోయి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక రోజు ఫోటో పడితే మరో రోజు పడకపోవడం, సాంకేతిక లోపాలతో హాజరు నమోదు కాకపోవడం పరిపాటిగా మారింది.పని చేసినా హాజరు లేకుండా చూపించడం వల్ల వేతనాలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన డబ్బులు నెలల తరబడి బకాయిలుగా పేరుకుపోయాయి. కుటుంబ పోషణ కోసం రోజువారీ కూలిపై ఆధారపడే ఈ ప్రజలు, ఇప్పుడు అప్పుల బారిన పడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా పర్యవేక్షణ ఉండాల్సిన అధికారులు మాత్రం కనిపించరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలను పరిష్కరించడంలో విఫలమై, కేవలం పర్యవేక్షణ పేరుతో మాటలకే పరిమితమవుతున్నారని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పరిస్థితి తీవ్రంగా మారినా, అధికారుల స్పందన లేకపోవడం ప్రజల్లో మరింత అసంతృప్తిని రగిలిస్తోంది. టెక్నాలజీ పేరుతో అమలు చేస్తున్న ఈ విధానం కూలీలకు మేలు చేయకుండా నష్టాన్ని మిగులుస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు. పని చేయడానికి వచ్చిన కూలీలు ఫోటో పడకపోతే తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం దుర్భరంగా మారింది. "పని చేశాం... కానీ హాజరు లేదు... డబ్బు లేదు... బతుకే ఎలా?" అన్న ప్రశ్న ప్రతి గ్రామంలో వినిపిస్తోంది.గిరిజన తండాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. సిగ్నల్ సమస్యలు, పరికరాల లోపాలు కారణంగా ఫోటోలు పడకపోవడం వల్ల కూలీలు పూర్తిగా నష్టపోతున్నారు. ఈ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నా పరిష్కారం మాత్రం కనిపించడం లేదు.ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఫోటో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఆగ్రహ జ్వాలలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఉపాధి హామీ పథకం పేదల బతుకుదెరువు కావాల్సింది పోయి... ఇప్పుడు వారి బాధల బాటగా మారడం పల్లెల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

## వార్డు సమస్యల వినతి

- ప్రత్యేక అధికారికి విస్తృత నివేదిక
- మౌలిక సదుపాయాలపై దృష్టి కోరిన కౌన్సిలర్

**అశ్వారావుపేట, ఏప్రిల్ 7 రాజ ముద్ర న్యూస్:**



అశ్వారావుపేట మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో నెలకొన్న వివిధ సమస్యలను ఖమ్మం నుంచి వచ్చిన ప్రత్యేక అధికారి అశోక్ కుమార్‌కు కౌన్సిలర్ దేరెంగుల ప్రసాద్ వివరించారు. మున్సిపాలిటీ చైర్మన్ జూపల్లి శశికళమ్మ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపాలిటీ కమిషనర్ బి నాగరాజు సహకారంతో ఈ అంశాలు సమగ్రంగా తెలియజేయబడ్డాయి. వార్డులో తాగునీటి సరఫరా లోపాలు, పారిశుద్ధ్య సమస్యలు, రహదారుల దుస్థితి వంటి అంశాలను ప్రాధాన్యతగా ప్రస్తావించారు. అదనంగా విద్యుత్ పోల్స్ ఏర్పాటు, కల్వర్టుల నిర్మాణం, సీసీ రోడ్లు, సైడ్ డ్రయిన్లు ఏర్పాటు అవసరాన్ని వివరించారు.అలాగే కమ్యూనిటీ హాలు నిర్మాణం, పైపులైన్ల విస్తరణ, బోర్ పాయింట్లు ఏర్పాటు, బోర్ మోటార్ల మరమ్మత్తులు వంటి అవసరాలను తెలియజేశారు. స్థానిక పాఠశాలలో హ్యాండ్ వాష్ సదుపాయాల కోసం అదనపు నిధులు, అదనపు తరగతి గది నిర్మాణం అవసరమని ప్రస్తావించారు.ప్రత్యేక అధికారి సమస్యలను స్వీకరించి సంబంధిత విభాగాలతో సమన్వయం చేసి దశలవారీగా పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. వార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయనే ఆశాభావం వ్యక్తమైంది.



## ఆరోగ్య అవగాహన సదస్సు

- సాయిస్ఫూర్తి కళాశాలలో క్యాన్సర్‌పై చర్చ


**సత్తుపల్లి, ఏప్రిల్ 7 రాజ ముద్ర న్యూస్:**

సత్తుపల్లి మండలం బి గంగారం లోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.డాక్టర్ గుళ్లపూడి రమ్య, డాక్టర్ శ్రీహరి క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతపై వివరించారు. ప్రారంభ దశలో గుర్తిస్తే ఎక్కువ శాతం వ్యాధులు పూర్తిగా నయం కావచ్చని సూచించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. వర్చువల్‌గా పాల్గొన్న బండి పార్థసారథి రెడ్డి, బండి అన్విద ఆరోగ్యంపై జాగ్రత్త అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పన్నుపై రాయితీ

- ఏప్రిల్‌లో చెల్లింపులకు ఐదు శాతం తగ్గింపు

**అశ్వారావుపేట, ఏప్రిల్ 7 రాజ ముద్ర న్యూస్:**



అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వ రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి నాగరాజు సూచించారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడిన ఆయన, ప్రతి సంవత్సరం బకాయిలు లేకుండా పన్ను చెల్లించే యజమానులకు ఐదు శాతం తగ్గింపు అందుబాటులో ఉంటుందని తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 30 లోపు చెల్లిస్తే ఈ రాయితీ వర్తిస్తుందని వివరించారు. చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా లేదా కార్యాలయంలో నగదు రూపంలో చేసుకోవచ్చని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు.

## ట్రైనర్‌గా ఉపాధ్యాయుడు



- ట్రైన్ ది ట్రైనర్ శిక్షణ పూర్తి
- గుమ్మడవల్లి ఉపాధ్యాయుడికి అభినందనలు

**ఖమ్మం, ఏప్రిల్ 7 రాజ ముద్ర న్యూస్:**

ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 30 రోజులపాటు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం ఖమ్మం పట్టణంలోని మినర్వ గ్రాండ్ హోటల్‌లో ఏప్రిల్ 4, 5 తేదీలలో జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో అనుభవజ్ఞులైన ట్రైనర్లు వివిధ రంగాలకు సంబంధించిన నైపుణ్యాలను అందించారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్, మోటివేషనల్ స్పీకింగ్ టెక్నిక్స్, ప్రజలతో ప్రభావవంతంగా మాట్లాడే విధానాలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాల వ్యక్తులకు ఉపయోగపడే అంశాలను సమగ్రంగా వివరించారు. ఈ శిక్షణలో పాల్గొని గుమ్మడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు బండి రామచంద్రరావు ట్రైనర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.శిక్షణా కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ గంపా నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైల్వే పాసుల పునరుద్ధరణ వినతి



**ఖమ్మం, ఏప్రిల్ 7 రాజ ముద్ర న్యూస్:**

జర్నలిస్టుల రైల్వే ప్రయాణ రాయితీ పాసులను పునరుద్ధరించాలని కోరుతూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా ప్రతినిధులు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కరోనా సమయంలో నిలిపివేసిన ఈ రాయితీలు ఇప్పటికీ పునరుద్ధరించకపోవడంతో జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామీణ స్థాయిలో వార్తల సేకరణ కోసం తరచూ ప్రయాణాలు అవసరమవుతున్న నేపథ్యంలో ఈ పాసులు కీలకమని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీ సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డబ్ల్యూజేఐ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



## బాలికల పాఠశాల తనిఖీ

- భోజనశాల, స్టోర్ రూమ్ సమీక్ష
- తరగతులు, సదుపాయాల పరిస్థితి పరిశీలన

**అశ్వారావుపేట, ఏప్రిల్ 07 రాజ ముద్ర న్యూస్:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఆశ్వారావుపేట ముస్లిమైనారిటి బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.భోజనశాలలో మెనును పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలను సమీక్షించారు. స్టోర్ రూమ్ లో సరుకుల నిల్వ, నాణ్యత స్థితిని పరిశీలించిన తర్వాత సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులు సందర్శించి విద్యార్థుల అనుభవం తెలుసుకున్నారు. పాఠశాల సదుపాయాల, విద్యా విధానం స్థితిని సమీక్షించారు. ప్రధానోపాధ్యాయితో చర్చించి పాఠశాల అవసరాలను, అదనపు సౌకర్యాల అవశ్యకతను గుర్తించారు. కార్యక్రమంలో.. ప్రిన్సిపల్ సంగీత, తాసిల్దార్, మండల అభివృద్ధి అధికారి, స్థానిక మున్సిపల్ కమిషనర్ బి. నాగరాజు, మండల విద్యాధికారి పి. ప్రసాదరావు, ఇతర మండలాధికారులు పాల్గొన్నారు.



## చెక్కులు పంపిణీ

- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు
- తెలంగాణ ప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

**అశ్వారావుపేట, జూన్ 7, 2026 రాజ ముద్ర న్యూస్:**

అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఖమ్మా జిల్లా మంత్రులు, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.వేడుకలో ఎంపీడీవో అశోక్, రెవెన్యూ సిబ్బంది రామారావు, హౌసింగ్ ఏఈ వినయ్, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ గౌరవం

- జనక్ ప్రసాద్‌కు ఐఎన్టీయూసీ అభినందనలు

**సత్తుపల్లి, ఏప్రిల్ 7 రాజ ముద్ర న్యూస్:**



ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. న్యూఢిల్లీ లో జిహెచ్ఆర్టి ఇండియా, వెబ్బిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేశారు.కార్మిక రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కినట్లు తెలిపారు. దశాబ్దాలుగా ట్రేడ్ యూనియన్ నాయకుడిగా, వేజ్ బోర్డ్ సభ్యుడిగా పనిచేస్తూ కార్మిక హక్కులు, సంక్షేమం కోసం కృషి చేసినందుకు ఈ గుర్తింపు లభించింది.ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. సత్తుపల్లి ప్రాంత ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

## హోమం శోభ..

- చిలకలగండి ముత్యాలమ్మ ఆలయంలో రుద్రం హోమం
- సర్కిల్ ఇన్స్పెక్టర్ దంపతుల ప్రత్యేక పూజా

**అశ్వారావుపేట, ఏప్రిల్ 7, 2026 రాజ ముద్ర న్యూస్:**

మంగళవారం, అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం లోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఘనంగా రుద్రం హోమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి నాగరాజు రెడ్డి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా జరిగింది.హోమం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మంత్రపఠనాలు, అర్చకుల గుణపఠనాలు జరుగుతూ వాతావరణాన్ని పవిత్రతతో నింపాయి. గుడి చైర్మన్, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, కుటుంబసభ్యులు శ్రద్ధతో పాల్గొని ఈ హోమంలో భాగస్వామ్యమయ్యారు. స్థానికులు, భక్తులు దంపతుల కోసం మంగళసంకేతాలను వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక శ్రద్ధతో జరిగిన ఈ హోమం పూజా వాతావరణాన్ని మరింత ఉల్లాసభరితంగా తీర్చిదిద్దింది.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని దంపతుల ఆనందానికి ఆనందం కలిగించారు. హోమం తరువాత ప్రత్యేక భోజనవిందులు, సాంప్రదాయ సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ వేడుక స్థానిక ప్రజలకు ఆనందాన్ని, ఆధ్యాత్మిక శాంతిని అందించిందని పేర్కొన్నారు.



